క్లుప్తంగా

మొక్కల పెంపకంతో కాలుష్య నివారణ

బేతంచెర్ల: పెరుగుతున్న వాతావరణ కాలుష్యాన్ని తగ్గించడానికి ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని ఎంపీడీఓ వెంగన్న అన్నారు. శుక్రవారం మండలంలోని గోరుమానుకొండ సమీపంలో ఉన్న బీసీ రెసిడెన్షియల్ పాఠశాల ఆవరణలో వనం-మనం కార్యక్రమంలో భాగంగా ప్రిన్సిపాల్ శ్రీనివాసులు గౌడు, సర్పంచ్ వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ సభ్యుడు రామనాథం, రవీంద్ర నాయక్‌తో కలిసి మొక్కలు నాటారు. అడవుల సంరక్షణ వల్ల కలిగే ఉపయోగాలను విద్యార్థులకు వివరించారు.

ఘనంగా తిరుచ్చి ఉత్సవం


పల్లకీపై విహరిస్తున్న మద్దిలేటి నరసింహస్వామి

బేతంచెర్ల: మండలంలోని మద్దిలేటి నరసింహ స్వామి ఆలయంలో భాద్రపద మాసం శుక్రవారం సందర్భంగా తిరుచ్చి ఉత్సవం నిర్వహించారు. స్వామివారిని పల్లకీలో ఆశీనులు చేసి మంగళవాయిద్యాలు, భక్తుల గోవింద నామస్మరణల నడుమ ఆలయ మాడ వీధుల్లో ఊరేగించారు. ఆలయ ఈఓ రామాంజనేయులు పర్యవేక్షించారు. ఆలయ ప్రధాన అర్చకులు మద్దిలేటి స్వామి, మనోహర్, నరసింహ పాల్గొన్నారు.

తులసి మొక్కల పంపిణీ


పంపిణీ చేస్తున్న ఆలయ ధర్మకర్త సుబ్బారావు

డోన్ టౌన్: స్థానిక వేంకటేశ్వరస్వామి దేవాలయంలో శుక్రవారం మట్టి వినాయకులు, తులసి మొక్కలను పంపిణీ చేశారు. ఆలయ ధర్మకర్త పాతాళం సుబ్బారావు రజనీకుమారి దంపతుల ఆర్థిక సహకారంతో పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి విగ్రహాలను అందించారు. గీతా యోగాసన సంఘం గురూజీ రాంపుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

సీహెచ్‌సీకి టేబుళ్ల విరాళం


టేబుళ్లను అందజేస్తున్న కార్పెంటర్ల సంఘం నాయకులు

కోవెలకుంట్ల: పట్టణంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు కోవెలకుంట్ల కార్పెంటర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం టేబుళ్లు విరాళంగా అందజేశారు. ఆస్పత్రికి వచ్చే రోగులు విశ్రాంతి తీసుకునేందుకు తమ వంతు సాయంగా ఐదు టేబుళ్లను సీహెచ్‌సీ ఇన్‌చార్జ్ డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డికి అందజేశారు. అసోసియేషన్ నాయకులు ఉసేన్‌వలి, రామాంజనేయులు, సుబ్రమణ్యం, రమణయ్య, సీహెచ్‌సీ హెడ్ స్టాఫ్‌నర్స్ పాల్గొన్నారు.

10న సామాజిక తనిఖీ

బనగానపల్లె రూరల్: జాతీయ ఉపాధి హామీ పథకం సోషల్ ఆడిట్ (సామాజిక తనిఖీ)కు సిబ్బంది సహకరించాలని ఎన్‌ఆర్‌ఈజీఎస్ సోషల్ ఆడిట్ స్టేట్ రిసోర్స్‌పర్సన్ కాంతయ్య కోరారు. శుక్రవారం స్థానిక పొదుపు భవనంలో డోన్ క్లస్టర్ ఇన్‌చార్జ్ ఏపీడీ బాలాజీనాయక్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. మండలంలో ఈ నెల 10వ తేదీ నుంచి సోషల్ ఆడిట్ జరుగుతుందని తెలిపారు. 2023-24కు సంబంధించి సుమారు రూ.8 కోట్లతో అభివృద్ధి పనులు చేసినట్లు తెలిపారు. ఏపీఓ హరికృష్ణ, పీఆర్ ఏఈ మహేష్ పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

సంజామల: మండల పరిధిలోని రెడ్డిపల్లె గ్రామంలో మద్యం విక్రయిస్తున్న పగడాల రజినిని అదుపులోకి తీసుకుని ఆమె వద్ద నుంచి 21 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ సి.రమణయ్య తెలిపారు. గ్రామంలో మద్యం అమ్ముతున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో కలిసి శుక్రవారం దాడి చేశామన్నారు. కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

విగ్రహాలకు అనుమతి తప్పనిసరి

కోవెలకుంట్ల: వినాయక చవితి పండుగను పురస్కరించుని విగ్రహాల ఏర్పాటుకు పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని కోవెలకుంట్ల ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. స్థానిక మేజర్ గ్రామ పంచాయతీతో పాటు పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆయా గ్రామాల్లో విగ్రహాలను ఏర్పాటు చేసే ఉత్సవ కమిటీ సభ్యులు పోలీసుల అనుమతి తీసుకుని మండపాల్లో విగ్రహాలను కొలువుంచాలన్నారు. ప్రశాంత వాతావరణంలో పండుగను జరుపుకోవాలని సూచించారు. వ్యక్తిగత కక్షలతో గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

11న స్వాతి నక్షత్ర వేడుకలు

బనగానపల్లె: పట్టణంలోని రవ్వలకొండపై వెలసిన శ్రీచెంచులక్ష్మీ సమేత పావన నరసింహ స్వామి దేవస్థానంలో ఈ నెల 11వ తేదీ స్వాతి నక్షత్ర వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపకుడు బాలిశెట్టి పావన నరసింహమూర్తి శుక్రవారం తెలిపారు. ఆలయంలో ప్రత్యేక పూజలు ఉంటాయని చెప్పారు.



కొలిమిగుండ్ల: వినాయక విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకెళుతున్న యువకులు, సంజామలలో,


డోన్‌లో అలంకరించిన వినాయక మండపం,


కోవెలకుంట్ల: డప్పు వాయిద్యాల నడుమ విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకెళుతున్న నిర్వాహకులు

చవితి.. సందడి

- గణేష్ మండపాల వద్ద జోరుగా ఏర్పాట్లు
- డప్పు వాయిద్యాల నడుమ విగ్రహాలను తీసుకెళ్లిన నిర్వాహకులు
- పూజా సామగ్రి కొనుగోలుదారులతో కిక్కిరిసిన దుకాణాలు, మార్కెట్లు
- గ్రామాల్లో సందడి

కోవెలకుంట్ల: మతసామరస్యానికి ప్రతీకగా హిందూ, ముస్లింలు అత్యంత వైభవంగా జరుపుకునే వినాయక చవితి వేడుకలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. బనగానపల్లె నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లోని మండపాల్లో గణనాథులు కొలువుదీరేందుకు సిద్ధంగా ఉన్నారు. కోవెకుంట్లలోని గుంజలపాడు రహదారి పక్కన, కానాల అంకిరెడ్డి కాలనీల్లో వివిధ రూపాల్లో వినాయక ప్రతిమలను విక్రయానికి ఉంచారు. కోవెలకుంట్ల, దొర్నిపాడు, ఉయ్యాలవాడ, సంజామల మండలాల్లోని ఆయా గ్రామాలకు చెందిన భక్తులు వినాయక ప్రతిమలను మండపాల్లో కొలువుంచేందుకు ప్రతిమలను తీసుకెళుతున్నారు. పండుగను పురస్కరించుకుని కోవెలకుంట్ల మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో శనివారం మండపాల్లో


బనగానపల్లె: మండపంలో పూజకు సిద్ధంగా గణనాథుడు

వినాయక విగ్రహాలను కొలువుంచి ఐదు రోజుల పాటు ప్రత్యేక పూజల అనంతరం బుధవారం వినాయక నిమజ్జన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. చవితి సందర్భంగా గ్రామాల్లో పండుగ సందడి నెలకొంది. ఆయా గ్రామాలకు చెందిన మహిళలు పూజా సామాగ్రి కొనుగోలులో నిమగ్నమయ్యారు.

బేతంచెర్లలో 41 మండపాలు

బేతంచెర్ల: మండలంలో వాడవాడలా విగ్రహాల ఏర్పాటుకు ముమ్మర ఏర్పాట్లు చేసుకుంటున్నారు.


బేతంచెర్లలో పూజా సామగ్రి కొనుగోలు చేస్తున్న ప్రజలు,


కోవెలకుంట్ల: వినాయక విగ్రహాలు కొనుగోలు చేస్తూ..

బేతంచెర్ల గణేష్ ఉత్సవ సమితీ ఆధ్వర్యంలో 41 చోట్ల విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నారు. వినాయక విగ్రహాల కొనుగోలు, పండుగ సరుకుల కోసం వచ్చిన ప్రజలతో పట్టణంలో సందడి వాతావరణం నెలకొంది. ఆయా స్వీట్ దుకాణాల్లో నెయ్యితో తయారు చేసిన వినాయక లడ్డూలు ప్రత్యేక ఆకర్షణగా ఉన్నాయి.

పల్లెల్లో వినాయక చవితి సందడి

కొలిమిగుండ్ల: వినాయక చవితి పండుగ సందర్భంగా పల్లెల్లో సందడి వాతావరణం నెలకొంది. చిన్నా, పెద్దా తేడా లేకుండా ఉత్సాహంగా వేడుకలు జరుపుకునేందుకు సిద్ధమయ్యారు. గ్రామాల్లో వినాయక మండపాలను ఏర్పాటు చేసి పోటాపోటీగా ముస్తాబు చేసుకున్నారు. శనివారం పండుగను పురస్కరించుకుని విగ్రహాలను కొలువుదీర్చడానికి శుక్రవారం అనంతపురం జిల్లా తాడిపత్రి, వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు, కర్నూలు ప్రాంతాలకు వెళ్లి వివిధ రూపాల్లో ఉన్న బొమ్మలను తీసుకొచ్చారు. వాహనాల్లో బొమ్మలు గ్రామాలకు చేరుకోగానే మేళతాళాలు, బాణసంచా కాల్పుల మధ్య ఊరేగింపుగా మండపాలకు తీసుకెళ్లారు. మూడు రోజుల పాటు ప్రత్యేక పూజల అనంతరం సోమవారం నిమజ్జనం చేయనున్నారు.

సాంస్కృతిక కార్యక్రమాలకు ఏర్పాట్లు

బనగానపల్లె: పండుగను పురస్కరించుకుని సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు ఆయా మండపాల నిర్వహకులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఈ నెల 11వ తేదీ బనగానపల్లె పట్టణం, 9వ తేదీ గ్రామీణ ప్రాంతాల్లో నిమజ్జన కార్యక్రమాలు జరగనున్నాయి. ఇందు కోసం మండలంలోని కైప చెరువు వద్ద పోలీసులు, రెవెన్యూ, విద్యుత్ అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. నిమజ్జనం రోజున బనగానపల్లె పట్టణంలో ఎలాంటి ఇబ్బంది లేకుండా విగ్రహాలు వెళ్లేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

జోరుగా కొనుగోళ్లు

సంజామల: వినాయక పూజ కోసం స్వామివారి విగ్రహాలు, పువ్వులు, పండ్లు, నిత్యావసర సరుకుల కొనుగోలుదారులతో దుకాణాలు కిటకిటలాడాయి. మండపాల్లో కొలువుంచేందుకు భారీ విగ్రహాలు కొనుగోలు చేసి ఆటోలు, ట్రాక్టర్లపై ఉంచి డప్పు వాయిద్యాల నడుమ ఆయా గ్రామాలకు తీసుకెళ్లారు. కాగా సంజామల మండలంలో 45 విగ్రహాలకు అనుమతులు ఇచ్చామని ఎస్‌ఐ రమణయ్య తెలిపారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మట్టి వినాయకులను పంపిణీ చేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పంపిణీ

బేతంచెర్ల: మట్టి వినాయకులను పూజించి పర్యావరణ పరిరక్షణలో భాగస్వామ్యులు కావాలని రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు వీరారెడ్డి, ప్రశాంత్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని శేషారెడ్డి ఆస్పత్రి వద్ద 300 మట్టి వినాయకులను ప్రజలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్(పీఓపీ) విగ్రహాలు వినియోగించడం వల్ల పర్యావరణానికి హాని కలుగుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ మట్టి వినాయకులను పూజించి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని కోరారు. అలాగే లయన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు మధు సూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో దాత దినేష్ సహకారంతో మట్టి వినాయకులను పంపిణీ చేశారు. క్లబ్ సభ్యులు విజయనాగరాజు, మాణిక్యం, గౌరి హుసేన్‌రెడ్డి పాల్గొన్నారు.

విష జ్వరాలు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలి

కోవెలకుంట్ల: ఇటీవల కురుస్తున్న భారీ వర్షాల కారణంగా దోమలు విజృంభించి విష జ్వరాలు ప్రబలే అస్కారం ఉందని, అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి కామేశ్వరరావు సూచించారు. శుక్రవారం మండలంలోని రేవనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో డ్రైడే ఫ్రైడే కార్యక్రమాన్ని పరిశీలించారు. పీహెచ్‌సీ పరిధిలోని ఆయా గ్రామాల్లో దోమ లార్వాను చంపేందుకు వేస్ట్ ఆయిల్, కిరోసిన్ చల్లించడం వంటి పనులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దోమల కారణంగా మలేరియా, డెంగీ, చికున్‌గున్యా, తదితర జ్వరాలు సోకే ప్రమాదం ఉందన్నారు. జ్వర లక్షణాలు కనిపించిన వెంటనే సంబంధిత ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో


ఆశావర్కర్లకు సూచనలిస్తున్న జిల్లా మలేరియా అధికారి కామేశ్వరరావు

చికిత్స చేయించుకోవాలని పేర్కొన్నారు. డాక్టర్లు విద్యాసాగర్, మహబూబ్‌సుభాని, హెల్త్ సూపర్‌వైజర్లు గిరిజ, ప్రభావతి ఉన్నారు.

తాగునీటి సరఫరాపై పరిశీలన


ఇటిక్యాలలో తాగునీటి సరఫరాను పరిశీలిస్తున్న సెంట్రల్ టీం సభ్యులు

కొలిమిగుండ్ల: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జల్‌జీవన్ మిషన్ కింద గ్రామాల్లో తాగునీటి సరఫరాపై శుక్రవారం సెంట్రల్ టీంకు చెందిన థర్డ్ పార్టీ బృందం సభ్యులు ఇటిక్యాల, కోర్నపల్లె తదితర గ్రామాల్లో పరిశీలన చేశారు. ఇంటింటికి కొళాయిల ద్వారా నీటి సరఫరా జరుగుతోందా లేదా అని క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. నివాసాల వద్దకు వెళ్లి నీటి సరఫరా గురించి ఆరా తీశారు. ఓవర్‌హెడ్ ట్యాంక్‌లు క్లోరినేషన్, ట్యాంకుల స్థితిగతులు.. ఆయా గ్రామాల్లో పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, హెల్త్ సెంటర్లను పరిశీలించారు. గ్రామాల్లో 12 ఇళ్లను ఎంపిక చేసి తాగునీటి సరఫరా సక్రమంగా జరుగుతుందా, ఇబ్బందులు ఎవైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. కొళాయిల ద్వారా సరఫరా చేస్తున్న నీటి నమూనాలను సేకరించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుబ్రమణ్యం, పంచాయితీ కార్యదర్శి రాఘవరెడ్డి ఉన్నారు.

వర్షాలతో పంటలకు తెగుళ్లు సోకే అవకాశం

బనగానపల్లె: ఇటీవల కురుస్తున్న వర్షాలతో పంటలకు తెగుళ్ల ఆశించే అవకాశం ఉందని.. రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో పంటలను పరిశీలించారు. ఎస్సార్‌బీసీ వ్యవసాయ బోర్ల ఆధారంగా రైతులు వరి, మొక్కజొన్న, పత్తి, మిరప పంటలను సాగు చేశారని, వర్షాధారంగా కంది, కొర్ర తదితర పంటలను సాగు చేశారన్నారు. వర్షాలతో మొక్కజొన్నలో కాండం తొలుచు పురుగు, కత్తెర పురుగు వల్ల పంటకు ఎక్కువ నష్టం వాటిల్లే అవకాశం ఉందన్నారు. మిరప పంటను నామాల


పంటలను పరిశీలిస్తున్న మండల వ్యవసాయాధికారి

పురుగు దెబ్బతీసే అవకాశం ఉందని.. రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. తెగుళ్ల నివారణకు వ్యవసాయ సిబ్బంది సలహాలు, సూచనలు పాటించాలన్నారు.

సోదరభావంతో ఉత్సవాలను జరుపుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న డోన్ డీఎస్పీ శ్రీనివాసులు

బేతంచెర్ల: సంస్కృతి సంప్రదాయాలను గౌరవిస్తూ సోదరభావంతో ఉత్సవాలను జరుపుకోవాలని డోన్ డీఎస్పీ శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో హిందూ, ముస్లింలతో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ..హిందూ, ముస్లింలు ఎన్నో పండుగలను కలసికట్టుగా జరుపుకుంటున్నారని తెలిపారు. విగ్రహాలు ఏర్పాటు మొదలు నిమజ్జనం వరకు ఉత్సవాలు విజయవంతం చేయడానికి అందరూ సహకరించాలన్నారు. అలాగే మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ వెంగన్న, తహసీల్దార్ ప్రకాశ్ బాబు, సీఐ డి.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో వినాయక మండపాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. నిమజ్జనం రోజున ఉదయం విగ్రహాలు ఊరేగింపు ప్రారంభించి సాయంత్రంలోగా నిమజ్జనం పూర్తి చేయాలన్నారు. మంటపాల వద్ద పరిశుభ్రంగా ఉండేలా ఆయా పంచాయతీ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని సూచించారు.

పెండింగ్‌లోని అభివృద్ధి పనుల పరిశీలన

ప్యాపిలి: డోన్ నియోజకవర్గంలోని ప్యాపిలి, డోన్ మండలాల పరిధిలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులను శుక్రవారం ఆర్థికశాఖ మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి పరిశీలించారు. డోన్ మండలంలోని కొత్తకోట గ్రామం వద్ద రూ. 8 కోట్లతో నిర్మిస్తున్న ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డ్రైవింగ్ అండ్ ట్రైనింగ్ రిసర్చ్ (ఐడీటీఆర్) భవనాలను పరిశీలించారు. త్వరితగతిన పూర్తిచేస్తే ఈ ప్రాంతం నిరుద్యోగ యువకులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ప్యాపిలి మండలం వెంగళాంపల్లి చెరువులో రూ. 2 కోట్లతో నిర్మిస్తున్న ఏపీ టూరిజం రిసార్ట్ పనులను పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. వెంగళాంపల్లితో పాటు వెంకటాపురం చెరువులో టూరిజం రిసార్ట్ ఏర్పాటు చేసేందుకు గత ప్రభుత్వం నిధులు మంజూరు చేసి 90 శాతం పనులను పూర్తి చేసిందన్నారు, బేతంచెర్ల మండలం బిల్వజ్వాల గుహలతో పాటు ప్యాపిలి మండలం వాల్మీకి గుహలను కూడా సందర్శకుల కోసం అపురూపంగా తీర్చిదిద్దామని తెలిపారు. వీటిలో ప్రస్తుత టీడీపీ ప్రభుత్వం కేవలం సందర్శకులకు


వెంగళాంపల్లి చెరువులో టూరిజం రిసార్ట్ పనులను పరిశీలిస్తున్న మాజీ మంత్రి బుగ్గన

తగిన మౌలిక వసతులను కల్పిస్తే చాలన్నారు. మద్దిలేటి స్వామి ఆలయం, డోన్‌లోని లక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయంతో పాటు అవులోని కంబగిరి స్వామి దేవాలయ పునరుద్ధరణ పనులను రూ. 12 కోట్లతో చేపట్టామని తెలిపారు. డోన్‌లో రూ. 3 కోట్లతో నిర్మిస్తున్న టీటీడీ కల్యాణ పండపం, ఎంపీడీఓ కార్యాలయ భవనాలు, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ భవనాలను త్వరితగతిన నిర్మించి అందుబాటులోకి తీసుకురావాల్సిన బాధ్యత టీడీపీ ప్రజాప్రతినిధులపై ఉందన్నారు. డోన్ ఎంపీపీ కమలాపురం రాజశేఖర్ రెడ్డి, జెడ్పీటీసీ బద్దల రాజ్‌కుమార్, సర్పంచ్‌లు అనిల్, రంగస్వామి, నాయకులు పోస్టు ప్రసాద్, రాజవర్ధన్, కృష్ణమూర్తి, కమతం భాస్కర్ రెడ్డి, గడ్డం భువనేశ్వర్ రెడ్డి ఉన్నారు.

మండపాల వద్ద విద్యుత్‌కు అనుమతి తప్పనిసరి

డోన్ టౌన్: వినాయక మండపాల వద్ద విద్యుత్ వినియోగానికి అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఏఈ నాగేశ్వరరెడ్డి తెలిపారు. నాణ్యమైన విద్యుత్ పరికరాలు, ఎల్‌ఈడీ బల్బులను వాడాలని సూచించారు. మండపం విస్తీర్ణంను అనుసరించి అనుమతి ఫీజు రూ.100తో పాటు అదనంగా అడ్వాన్సు చార్జీల రూపంలో రూ.1000 నుంచి రూ.15వేల వరకు డిపాజిట్ చేయాలన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

కోవెలకుంట్ల: పట్టణ శివారులోని టీటీడీ కల్యాణ మండప సమీపంలో పేకాట ఆడుతున్న వ్యక్తులను శుక్రవారం అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. పట్టణానికి చెందిన ఆరుగురు వ్యక్తులు పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో దాడి చేశామన్నారు. వారి వద్ద నుంచి పేక ముక్కలు, రూ. 28,560 నగదు స్వాధీనం చేసుకుని పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

వివాహిత అదృశ్యం

కోవెలకుంట్ల: మండలంలోని చిన్నకొప్పెర్ల గ్రామానికి చెందిన దూదేకుల ఆయేషా అదృశ్యమైనట్లు రేవనూరు ఏఎస్‌ఐ బాబు తెలిపారు. ఈ నెల 3వ తేదీ రాత్రి ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదన్నారు. కుటుంబ సభ్యులు బంధువులు, స్నేహితురాళ్ల ఇళ్ల వద్ద గాలించినా ఆచూకీ లభించకపోవడంతో ఆమె భర్త ఉదార్‌బాషా ఫిర్యాదు మేరకు శుక్రవారం మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు మృతి

డోన్ రూరల్: మండల పరిధిలోని ఓబులాపురం గ్రామ సమీపంలోని 44వ జాతీయ రహదారిపై ఈనెల 2వ తేదీ బైక్‌ను కారు ఢీకొనడంతో ఇద్దరు గాయపడ్డారు. ఇందులో ఓ యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. మృతుడు అనంతపురం జిల్లా, గుంతకల్ మండలం, విడపనకల్ గ్రామానికి చెందిన రామాంజినేయులు(32)గా రూరల్ పోలీసులు తెలిపారు.

ఉపాధ్యాయులకు సన్మానం


ఉపాధ్యాయులను సన్మానిస్తున్న సేవా సంస్థ సభ్యులు

కోవెలకుంట్ల: ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణానికి చెందిన మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధర్యంలో శుక్రవారం ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఉపాధ్యాయులు శివనాగయ్య, మధుమితను శాలువా, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. ఎంఈఓ వెంకటసుబ్బయ్య, సంస్థ చైర్మన్ డాక్టర్ వెంకటేశ్వరరెడ్డి, వైస్ చైర్మన్ రామచంద్రరాజు, సెక్రటరీ రామసుబ్బారెడ్డి, రిటైర్డ్ లెక్చరర్ తిమ్మారెడ్డి, సంస్థ సభ్యులు తిమ్మారెడ్డి, సుబ్బారెడ్డి, మురళీమోహన్‌రెడ్డి, సహదేవరెడ్డి, శివశంకర్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి పాల్గొన్నారు.


నాగరాజు దంపతులను సత్కరిస్తున్న మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

బేతంచెర్ల: మండలంలోని గోరుమానుకొండ ఏపీ మోడల్ స్కూల్ తెలుగు ఉపాధ్యాయుడు డాక్టర్ గంగుల నాగరాజు గురువారం జిల్లాస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. శుక్రవారం మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ మరియదాసు, ఉపాధ్యాయులు నాగరాజు దంపతులను ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన సేవలను కొనియాడారు.